## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సబ్‌స్టేషన్ పరిధి కాళేశ్వరం, మెట్‌పల్లి గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

### దేశగతిని మార్చే అద్భుతమైన బడ్జెట్



భూపాలపల్లి రూరల్: మధ్య తరగతికి అనుకూలమైన విధంగా దేశ గతిని మార్చే అద్భుతమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా, చైనా తర్వాత మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే దిశగా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. పత్తి, పప్పు దినుసులు పండించే రైతులకు లాభదాయకంగా ఉందన్నారు. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్య అన్నారు.

### బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు సంతోష్‌నాయక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని విమర్శించారు.

### పోస్టర్ ఆవిష్కరణ



కాళేశ్వరం: హైదరాబాద్‌లో ఈ నెల 07న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేల గొంతులు–లక్షల డప్పుల మహాప్రదర్శన వాల్ పోస్టర్‌ను మహదేవపూర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా జరుగుతున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. వర్గీకరణ జరిగే వరకూ పోరాడుతునే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రవితేజ, ధర్మయ్య, తూటిచెర్ల దుర్గయ్య, భాస్కర్, సదానందం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 07న నిర్వహించనున్న వేల గొంతులు–లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడిమాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు సమర్థిస్తున్న ప్రతి ఒక్కరు డప్పు వేసుకొని మహా ప్రదర్శనకు హాజరు కావాలని అన్నారు. భారత అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### మిర్చి తోటల పరిశీలన

పలిమెల: మండలంలోని పంకెనలో రైతు దుర్గం బాణయ్య సాగు చేసిన అద్వంట సీడ్స్ కంపెనీ గోల్డెన్ వండర్ రకం మిర్చి తోటను కంపెనీ ప్రతినిధులు, డీలర్లు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత వాతావరణాన్ని, చీడపీడలను తట్టుకొని పంట ఏపుగా పెరిగి మంచి కాపు రావడం పట్ల సాగు చేసిన రైతు సంతోషంగా ఉన్నట్లు కంపెనీ మేనేజర్ మనోజ్ చౌదరి తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డీలర్లు తడుకల మహేష్, వీరాస్వామి, రాజు, కంపెనీ ప్రతినిధి తోట సమ్మయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

### గుండె పోటుతో చిరువ్యాపారి మృతి



సబ్దార్ (ఫైల్)

కాటారం: మండల కేంద్రానికి చెందిన చిరువ్యాపారి సబ్దార్(28) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి వ్యాపారం ముగించుకొని ఇంటికి వచ్చిన సబ్దార్ కాసేపటికి ఛాతిలో నొప్పితో అనారోగ్యానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు భూపాలపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరువ్యాపారం చేసుకునే సబ్దార్ మృతితో ఆయన కుటుంబం రోడ్డునపడింది. కాగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు ఆత్మకూరి కుమార్‌యాదవ్, పలువురు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

- పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- అదనపు తరగతుల నిర్వహణ



తాడిచర్ల హైస్కూల్లో అదనపు తరగతుల సమయంలో చదువుకుంటున్న విద్యార్థులు

మల్హర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 39, మల్లారంలో 14, పెద్దతూండ్లలో 06, వల్లెకుంటలో 07, మల్లారం కస్తూరిబా పాఠశాలలో 28, ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో 58 మంది మొత్తం 152 విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అధ్యయనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను తిరిగి అర్థమయ్యేలా బోధిస్తున్నది. చాలా పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనను పోగొడుతున్నారు. ప్రతి విషయంలో ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు తరగతుల సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం సైతం అందిస్తుంది.

#### ప్రతీ రోజు పరీక్షలు



ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే అల్పాహారం కూడా అందిస్తున్నారు. ప్రతీ రోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- వంశీ, విద్యార్థి, తాడిచర్ల హైస్కూల్

#### లక్ష్యం చేరుకోవాలి

మండలంలోని ప్రతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఒక లక్ష్యాన్ని నిర్ణయించాం. ఈ మేరకు చేరుకోవాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. అందుకు తగ్గట్టుగానే ఉపాధ్యాయులు తమ ప్రయత్నాలు చేస్తూ ప్రత్యేక తరగుతులపై దృష్టిసారిస్తున్నారు.

- లక్ష్మణ్‌బాబు, ఎంఈఓ, మల్హర్

## డిజిటల్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారంలో నిర్మాణ్–నాస్కాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'డిజిటల్ లిటెరసి–ఫినాన్షియల్ లిటెరసి' ప్రోగ్రాం ద్వారా ప్రజలకు మొబైల్ వినియోగం, ఆన్లైన్ ద్వారా జరిగే మోసాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు వరప్రసాద్, లక్ష్మీ నారాయణ, రాజశేఖర్, భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను అలవాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దరఖాస్తులు చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. మత్తు పదార్థాలు, ఆన్లైన్ ద్వారా జరిగే మోసాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వివరించారు.

### మండల కమిటీ ఎన్నిక



రాజు, అధ్యక్షుడు



మనోజ్, ప్రధాన కార్యదర్శి

మొగుళ్లపల్లి: ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీని ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమేశ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూడపాక రాజు మహారాజ్, ప్రధాన కార్యదర్శిగా నరెడ్ల మనోజ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా బండారి కుమార్, ఇంజంపెల్లి అశోక్, ట్రెజరీగా సురువు ప్రణయ్ బోయను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ధర్మసమాజ్ స్టూడెంట్ యూనియన్ జిల్లా కన్వీనర్ దూడపాక శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

- కాంగ్రెస్ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య



మాట్లాడుతున్న ధనసరి సూర్య

ములుగు: కేంద్రం తెలంగాణకు అన్ని రంగాల్లోను తీరని అన్యాయం చేసిందని బడ్జెట్‌లో ఏ రంగానికి ఆశించిన మేర నిధులను కేటాయించకుండా వివక్ష చూపిందని కాంగ్రెస్ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ.. ములుగులోని గిరిజన యూనివర్సిటీకి బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఆశించిన మేర నిధులను తెలంగాణకు కేటాయించక పోవడం దారుణమన్నారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెలంగాణకు తెచ్చింది గాడిద గుడ్డు అని వెంటనే తెలంగాణ ప్రజలు రాష్ట్ర బీజేపీ నాయకులు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు మల్లాడి రామ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, గొల్ల పల్లి రాజేందర్ గౌడ్, వంగ రవి యాదవ్, బైరెడ్డి భగవాన్, ఇస్సార్ ఖాన్, మారం సుమన్ రెడ్డి, పల్లె జైపాల్ రెడ్డి, బొక్క సత్తి రెడ్డి, మర్రి రాజు యాదవ్, జక్కుల రేవంత అ యాదవ్, కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన బొట్ల రజనీకర్ పబ్లిక్ హెల్త్ విభాగంలో ఏఈ ఉద్యోగం సాధించాడు. దీంతో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు రేణుకుంట్ల మహేష్, జన్ను సంజీవ్, రఘు, సాంబయ్య, స్వామి, సదానందం, సుధాకర్, రాజేష్, శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్

- తుమ్మల వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా సీపీఎం కార్యాయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా తుమ్మల వెంకట్ రెడ్డి హాజరై మట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతు వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. రైతు పండించిన రైతుకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్న ఇంత వరకు ఊసే లేదని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా బడ్జెట్ లేదని ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై ప్రత్యక్ష, పరోక్ష భారాలు పడి ధరలు ఆకాశాన్ని అంటే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణ బీజేపీ నుంచి ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న రాష్ట్రానికి ఒరిగేది ఏమి లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోదిళ్ల చిట్టిబాబు, మండల కమిటీ నాయకులు గుండు రామస్వామి, కొట్టె కృష్ణారావు, అంబాల పోషాలు, మంచాల కవిత, శ్రీరామోజు సువర్ణ, సామ మహేష్, చల్ల పాండురంగా తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ములుగు రూరల్: మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2005-06 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించా రు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, శేషగిరి సుదర్శనచారి, వెంకటాచలం, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపూరం(కె): మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన 2002–03 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు బెజ్జని రజిత, వెంకట్, కరీం, బలరాం పాల్గొన్నారు.



మల్లంపల్లిలో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

## మోరంచ ఎత్తిపోతలకు మరమ్మతులు



లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద పనులు చేస్తున్న కూలీలు

భూపాలపల్లి రూరల్: రెండు సంవత్సరాల క్రితం వరదకు మోరంచపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుపోయాయి. దీంతో ఇటీవల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మరమ్మతు పనులకు రూ.30 లక్షలు కేటాయించగా పనులు చేస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో యాసంగి పొలాలకు ఇరిగేషన్ నీటిని ఎత్తి పోయనుందని గ్రామస్తులు తెలిపారు. ఎత్తిపోతల మరమ్మతు పనులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యేకు మోరంచపల్లి గ్రామస్తులు తిరుపతిరెడ్డి, చాడ రఘునాథరెడ్డి, నూకల నర్సింహారెడ్డి, దేవేందర్, చుక్క రమేష్, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆవిర్భావ వేడుకలు



పనిముట్లను అందిస్తున్న రవీందర్‌రెడ్డి

ములుగు రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ వేడుకలను మల్లంపల్లి మండలం దేవనగర్ గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి ఉపాధి హామీ కూలీలకు పనిముట్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంపై ఆధారపడి కూలి చేసుకునే వారికి ఉపాధి హామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సంతోష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు



అబ్బాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ శంకర్



పస్రాలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై కమలాకర్

- సీఐ శంకర్

ములుగు రూరల్: రైతులు పంటల రక్షణకు బైండింగ్ వైర్ ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని అబ్బాపూర్, శ్రీరాములపల్లి, బాణాలపల్లి, కుమ్మరిపల్లి గ్రామాల రైతులకు సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట రక్షణలో భాగంగా పంట చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం వల్ల ఇటీవల జాకారం గ్రామానికి చెందిన మహిళ మృతి చెందిందని అన్నారు. రైతులు పంటల చుట్టూ ఏర్పాటు చేసిన బైండింగ్ వైర్‌లను తొలగించాలని అన్నారు. వేటగాళ్లు, రైతులు పంటలకు కరెంట్ వినియోగించినట్లుతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: పంట పొలాల్లో, అడవుల్లో కరెంట్ తీగలు అమర్చి మనుషులకు ప్రమాదాలు కలిగిస్తే చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పాత నేరస్థులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కొందరు పంట పొలాలకు రక్షణ నిమిత్తం, వన్య ప్రాణులను వేటాడడం కోసం కరెంట్ తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని అన్నారు. వీటి వాళ్ల మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇక మీదట ఎవరైనా కరెంట్ తీగలు అమర్చిన, ఉచ్చులు బిగించినచో పస్రా పోలీస్ వారికి సమాచారం అందించాలని అన్నారు.

### పోలీస్‌స్టేషన్‌లో యోగా శిక్షణ



యోగా చేస్తున్న ఎస్సై వెంకటేష్, సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకుల గూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో యోగా గురువు రాంబాబు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యోగాతో ఉపయోగాలను సిబ్బందికి వివరించారు. యోగాతో ఆరోగ్యం ఉంటామని తెలిపారు. ప్రతీ రోజు యోగా చేయాలన్నారు.

### రాంజీ సక్పాల్ వర్ధంతి



పూలమాల వేస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తండ్రి రాంజీ సక్పాల్ వర్ధంతిని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య హాజరై రాంజీ సక్పాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# అందుబాటులో లేని వైద్యులు



వైద్యం పొందుతున్న కృష్ణ



రోగిని పరీక్షిస్తున్న స్టాఫ్ నర్సు మంగ

- ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు తప్పని తిప్పలు



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

వాజేడు: మండల కేంద్రంలోని వైద్యశాలలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఆదివారం గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన ఆరోగ్య మిత్ర గెజ్జెల కృష్ణకు ముక్కులో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఇద్దరు వైద్యుల్లో ఒక్కరూ కూడా అందుబాటులో లేరు. దీంతో అక్కడ ఉన్న స్టాఫ్ నర్సు మంగ వైద్యాధికారి మహేందర్ సూచనల ప్రకారం కృష్ణకు వైద్యం చేశారు. వైద్యాధికారి నేరుగా కృష్ణకు ఫోన్ చేసి నేను వస్తున్నాను దారిలో ఉన్నానని మీ ఆరోగ్య పరిస్థితి ఏంటి, ప్రస్తుతం ఎలా ఉన్నారని అడిగినట్లు తెలిసింది. కాగా, అంతకు ముందే విధులు నిర్వహించిన వైద్యాధికారి మధుకర్ ఒక కాన్పు చేసి తను వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి పోయినట్లు తెలిసింది. అప్పటికే వైద్య శాలకు రావాల్సిన మహేందర్ సమయానికి చేరుకోలేదు. ఈ సమయంలో ముగ్గురు రోగులు వైద్యశాలకు వచ్చారు. స్టాఫ్ నర్స్ వైద్యం అందించినప్పటికీ వారు సంతృప్తి చెందకపోగా ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ, రోగులకు వైద్యం చేస్తున్న దృశ్యాలను ఫొటోలు తీసి డీఎమ్‌హెచ్‌ఓ గోపాల రావుకు వాట్సాప్ ద్వారా పంపించారు. పరిశీలిస్తానని మరో మారు ఇలా జరుగకుండా చూస్తానని సదరు వ్యక్తికి డీఎమ్‌హెచ్‌ఓ తెలిపారు. ఈ విషయంపై వైద్యాధికారి మహేందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా అప్పటి వరకు వైద్యం చేసిన మధుకర్ వెళుతూ తనకు సమాచారం ఇచ్చారని తాను ఆస్పత్రికి వస్తున్నానని ఈ లోగా రోగులు వచ్చినట్లు స్టాఫ్ నర్సు చెప్పడంతో పలు సూచనల మేరకు వైద్యం చేసినట్లు తెలిపారు. రోగులతో తాను కూడా మాట్లాడానని తెలిపారు. ఎలాంటి సమస్య లేదని ప్రతి నిత్యం రోగులకు అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్నామన్నారు.

### ఉచిత వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో ఏటూరునాగారం న్యూవస్ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్సై తాజొద్దీన్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. అపోలో ఆస్పత్రి వారు రూ.1.50లక్షల విలువ చేసే మందులను రోగులకు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, వైద్యులు అజయ్‌కుమార్, నమ్రత, రామారావు, అనిల్‌రాజు, వెంకటేష్, నిఖిత, రమేష్, రాకేష్, అంకిత, సృజన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.